ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - గొలుగొండ. మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో గల ప్రభుత్వ హైస్కూల్లో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం మాట్లాడుతూ ప్రజలందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ 85 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఇంటి వద్ద ఉండే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, నాగరాజు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్‌లో చిత్ర విచిత్రాలు

- చిన్న వీధి అక్రమ కళ్యాణ మండపంపై చర్యలేవి..?
- పత్రికల్లో కథనాలు వచ్చినా స్పందించరా..?
- టౌన్‌ప్లానింగ్‌కు రూ.50 వేలు ఇచ్చినట్లు బహిరంగ ప్రచారం
- కానుకలు తీసుకొని.. చర్యలు తీసుకునే ధైర్యం ఉందా..?

విశాలాంధ్ర బ్యూరో- అనకాపల్లి: అనకాపల్లి జోన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి... అక్రమ నిర్మాణాలను ముందే గ్రహించిన అధికారులు నిర్మాణదారులతో కుమ్మక్కై తమకు కావాల్సింది తాము తీసుకుంటూ సర్దుకుపోతున్నారు. కొందరి ఫిర్యాదులతో పత్రికల్లో కథనాలు రాస్తే చర్యలు తీసుకుంటామంటూ... నోటీసులు ఇవ్వామంటూ జర్నలిస్టులను మభ్యపెట్టడానికి తూతూ మంత్ర మాటలు చెప్పడం తప్ప సదరు అక్రమ నిర్మాణాలపై ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవంటే ఆశ్చర్యపోనక్కర్లేదు...

పట్టణంలో చిన్నవీధి రెసిడెన్షియల్ ప్రాంతంలో భారీ కమర్షియల్ కళ్యాణ మండపం నిర్మించినా కూడా... అధికారులు కనీసం పట్టించుకకపోవడం వెనుక మర్మమేమిటో అని ఆరా తీస్తే... నిర్మాణదారుడే టౌన్ ప్లానింగ్ అధికారి పాత్ర పై, అధికారికి సమర్పించిన కానుకపై బహిరంగ ప్రచారం చేయడం విశేషం. టౌన్‌ప్లానింగ్ అధికారికి అక్షరాల 50 వేల రూపాయలు ఇచ్చినట్లు సదరు నిర్మాణదారుడు బహిరంగంగా ప్రచారం చేస్తున్నాడంటే అర్థం చేసుకోవచ్చు అధికారుల తీరు ఏ మేరకుందో.... పత్రికల్లో వచ్చిన కథనం మేరకు చర్యల కోసం ఆరా తీస్తే నోటీసులు ఇస్తాం. చర్యలు తీసుకుంటాం అని చెప్పడం వారి బరితెగింపునకు, నిర్లక్ష్యానికి నిదర్శనం.

తీసుకున్న దానికి న్యాయం చేస్తారో... పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందిస్తారో వేచి చూడాలి. తీసుకున్న ప్లాన్ విరుద్ధంగా ప్రయోగాలు చేసి నిర్మించిన కళ్యాణ మండపం భద్రతపై కూడ అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వివిధ శుభాకార్యలకు అధిక సంఖ్యలో జనం వస్తే ఆ నిర్మాణం ఆ బరువును తట్టుకోగలదా..అనే అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి.

పాఠశాలకు ఫ్యాన్ వితరణ

విశాలంధ్ర - అచ్యుతాపురం: మండలంలో తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాలకు గ్రామ సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి శివ బాపునాయుడు మనవడు పుట్టినరోజు సందర్భంగా గురువారం టవర్ ఫ్యాన్‌ను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మారిశెట్టి వెంకట అప్పారావు మాట్లా డుతూ వేసవిలో పాఠశాల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు చూసిన సర్పంచ్ కుమారుడు శరగడం శేఖర్ స్పందించి టవర్ ఫ్యాన్ విరాళంగా ఇవ్వడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి శివ బాపునాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆదారి ఆనంతరావు, సహోపాధ్యాయిని వై.అరుణకుమారి, శరగడం శేఖర్ పాల్గొన్నారు.

20 లీటర్ల నాటుసారా పట్టివేత

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో సీతకండి గ్రామం శివారులో నాటు సారా తయారీదారులపై దాడులు నిర్వహించి 20 లీటర్ల సారాతో పాటు ఒకరిని అరెస్టు చేసినట్లు గొలుగొండ ఎస్సై కృష్ణమూర్తి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. కొయ్యూరు మండలం వెల్లలపాల గ్రామానికి చెందిన దూరి బొద్దేస్ అనే వ్యక్తిని అరెస్టు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మండలంలో ఎవరైనా నాటుసారా క్రయవిక్రయాలకు పాల్పడినా, తయారుచేసిన వారిపై దాడులు చేసి కేసును నమోదు చేయనున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా అటువంటి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి జిల్లా, చోడవరం పీఎస్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన హెచ్.జి.నెం.606, సి.హెచ్.సింహాచలం నాయుడు, భార్య లక్ష్మికి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూ.3, 91,920/- నగదును కేటాయించారు. సదరు నగదును చెక్ రూపంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆర్థిక సహాయాన్ని అంద జేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులు ఎవరైనా విధి నిర్వహణలో మరణించిన లేదా పదవీ విరమణ పొందిన వారికి ఆర్థికంగా ఆదుకునేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలలో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే ఒక రోజు డ్యూటీ అలవెన్స్ ను ఆర్థిక సహాయంగా అందజేస్తారన్నారు. అందులో భాగంగానే ఈ ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనధికారి బి.శారద పాల్గొన్నారు.

మాడుగుల ఉమ్మడి అభ్యర్థిని గెలిపిద్దాం

విశాలాంధ్ర - కే.కోటపాడు: బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను రాబోయే పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించుకోవాలని మాడుగుల నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ మేడపురెడ్డి శ్రీనివాస్ కోరారు. స్థానిక మండల బిజెపి కార్యాలయంలో గురువారం బిజెపి కార్యకర్తల సమావేశం జరిగింది. మండల బిజెపి అధ్యక్షుడు కోటాన ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని పోలింగ్ బూత్‌లలో బిజెపి పోలింగ్ ఏజెంట్లను నియమించడంతోపాటు టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలను, నాయకులను కలుపుకొని పోవాలని సూచించారు. అందరూ మిత్ర ధర్మం పాటించి అభ్యర్థుల గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని కోరారు. అభ్యర్థులు ఎవరైనా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బర్నికాన అప్పలకొండ కుమార్, ఇమంది సన్యాసిరావు, కూనిశెట్టి దాలినాయుడు, వరి వెంకట్రావు, శరగడం సన్యాసినాయుడు, బండారు సత్యనారాయణ పాత్రుడు, బోలెం సురేష్, సిరికి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడు గెలుపు తథ్యం

విశాలాంధ్ర - గొలుగొండ: ఎన్డీఏ అభ్యర్థిగా నర్సీపట్నం నుండి పోటీ చేస్తున్న చింతకాయల అయ్యన్నపాత్రుడు అత్యధిక మెజార్టీతో గెలవడం తథ్యమని గొలుగొండ మండలం భారతీయ జనతా పార్టీ మండల పార్టీ అధ్యక్షులు చందక గౌర్నాయుడు అన్నారు. గురువారం నర్సీపట్నంలో అయ్యన్న స్వగృహంలో అయ్యన్న పాత్రుడను, ఆయన కుమారుడు విజయ్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీ కార్యకర్తలు అయ్యన్నపాత్రుడు విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పల్లా రమణ, యాదవ్ మండల యువమోర్చా అధ్యక్షులు కొల్లి దుర్గాప్రసాద్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి రుతుల మహేంద్ర, బిజెపి పార్టీ కార్యకర్తలు చిటికెల హరి, గుత్తల బంగారయ్య పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకున్న ప్రభుత్వం వైసీపీనే

విశాలాంధ్ర - పాయకరావుపేట: మత్స్యకారులను అన్ని విధాల ఆదుకున్న ప్రభుత్వం వైసీపీ అని వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. మండలంలోని రాజవరం శివారు గజపతినగరం గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు ఇతర పార్టీల నుంచి వైసీపీ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి వైసీపీ అభ్యర్థి కంబాల జోగులుతోపాటు పలువురు వైసిపి నాయకులు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో కష్టపడి పని చేయాలని కోరారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకొని అభివృద్ధి చేసిన ఘనత ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు జరిగిన పథకాలన్నీ తిరిగి అమలు జరగాలంటే వైసీపీ అధికారంలోకి రావాలని, ప్రజలంతా ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వైసీపీ పేదల పార్టీ అని, పొత్తుల పార్టీ పెత్తందారుల పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, ధనిశెట్టి బాబూరావు, జిల్లా ప్రచార కమిటీ విభాగం అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీను, జడ్పిటిసి లంకా సూర్యనారాయణ, సర్పంచ్ గోసల అమ్మాజీ, ఎంపీటీసీ గోసల మరిణమ్మ, మేడిశెట్టి రామ గోవిందు, దేవవరపు రాజేష్ ఖన్నా, యజ్జల సత్యనారాయణ, గోసల రమణ, గోవిందు, కాకాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్ అవర్ పాటిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం

విశాలాంధ్ర - మాకవరపాలెం :ఈనెల 23వ తేదీన ఎర్త్ అవర్‌ను పాటిద్దాం అని రాత్రి 8: 30 నుంచి 9: 30 గంటల వరకు అవసరంలేని లైట్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్విచ్ ఆఫ్ చేసి ఉంచుదామని మాకవరపాలెం మండలం తూటిపాల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోసూరు రాము పిలుపునిచ్చారు. 2023వ సంవత్సరం అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన సంవత్సరంగా ఉద్భవించిందని భూమి మీద ఉష్ణోగ్రతలు తగ్గి జీవజాతులు అన్నీ సక్రమంగా ఉండాలి అంటే పర్యావరణాన్ని మనం రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులకు వివరించారు. అనంతరం పర్యావరణాన్ని రక్షించాలి ఎర్త్ అవర్‌ను పాటిద్దాం అనే స్లోగన్స్ ప్రదర్శింపజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని సంతోషి, లోవరాజు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆచంట

విశాలాంధ్ర - పాయకరావుపేట: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాయకరావుపేట పట్టణానికి చెందిన ఆచంట శ్రీకాంత్ నియమితులయ్యారు. తన నియామకం పట్ల పార్టీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావుకు, యువ మోర్చ జిల్లా అధ్యక్షులు గేదెల స్వరూప్‌కు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

విశాలాంధ్ర - నర్సీపట్నం: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజవర్గం నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో గురువారం అధికారులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) జయరాం సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం నాలుగు మండలాల ఎంపీడీవోలు, పోలీసు అధికారులు, వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీ ఎలక్షన్ మోడ్ ఆఫ్ కాండాక్ట్ కమిటీతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్వో జయరాం మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మోడల్ ఆఫ్ కాండాక్ట్ పక్కాగా అమలు చేసే విధంగా ఏ విధమైన చర్యలు తీసుకోవాలన్న దానిపై అధికారులకు ఆర్వో వివరించారు. అంతేకాకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తొమ్మిది నియోజకవర్గాల్లో పని చేస్తాయని ఆర్వో జయరాం అధికారులకు తెలియజేశారు. ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎటువంటి పొరపాట్లు జరిగినా అందుకు ఆయా అధికారులే బాధ్యులు అవుతారని తెలిపారు.

నర్సీపట్నం ఎన్నికల పరిశీలకులుగా చిక్కాల రామారావు

విశాలాంధ్ర - పాయకరావుపేట: నర్సీపట్నం ఎన్నికల పరిశీలకులుగా మండలంలోని పెంటకోట గ్రామానికి చెందిన జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు పాయకరావుపేట మండలంలోని పలువురు వైసిపి నాయకులు రామారావును ఘనంగా సన్మానించారు. మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన గోసల రమణ ఆధ్వర్యంలో పలువురు మత్స్యకారులు శాలువా, పూలదండలతో రామారావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చోడిపిల్లి అన్నవరం, పల్లా శ్రీను, చేపల జగన్నాథం, చేపల తాతాజీ, చేపల దేవుడు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

విశాలంధ్ర - అచ్యుతాపురం: మండలంలో మార్టూరు గ్రామ దేవత శ్రీ నూకాలమ్మ తల్లి అమ్మవారి పండగ సందర్భంగా ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు (కన్నబాబురాజు), మాజీ డిసిసిబి చైర్మన్ యు.సుకుమార్ వర్మ (తేజ) గురువారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారితోపాటు జెడ్పీటీసీ లాలం రాంబాబు, ఎంపీపీ కోనా సంధ్య బుజ్జి, దేశంశెట్టి శంకరరావు, పిన్నంరాజు వాసు, వడిశల శ్రీనివాసరావు, నాయకులు, మార్టూరు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీకి బాబ్జి రాజీనామా జనసేనలో చేరిక

విశాలాంధ్ర - అచ్యుతాపురం: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ ద్వారపురెడ్డి బాబు (బాబ్జి) రాజీనామా చేశారు. పార్టీ సభ్యత్వం, పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. అనంతరం ఎలమంచిలి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో జనసేన కండువా వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో తమకు తమ నాయకులకు, కార్యకర్తలకు ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కన్నబాబు నిర్లక్ష్య ధోరణితో కార్యకర్తలకు అసలు గుర్తింపే లేదన్నారు. గుర్తింపు లేని పార్టీలో ఉండేందుకు ఏ నాయకుడు మొగ్గు చూపడం లేదన్నారు. జనసేన అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ ప్రజలతో కలిసిపోయే స్వభావం నచ్చిందన్నారు. తాను తనతో నడిచే వారంతా విజయ్ కుమార్ కి మద్దతు పలుకుతామన్నారు. దీంతో వైసీపీ పార్టీలో అప్పుడే ఒకింత ఆందోళన నెలకొంది అంటే ఆశ్చర్యమక్కర్లేదు. అచ్యుతాపురం లో ప్రెసిడెంట్, ఎంపీటీసీ వంటి అనేక పదవులు చేసి ప్రజల్లో మంచి పేరున్న నాయకుడు బాబ్జి వైసిపి ను వదిలేయడంతో పార్టీకి ఒక పెద్ద దెబ్బే అని క్షేత్ర స్థాయి రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ రెండు మూడు రోజుల్లో కీలక రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్న ఆశ్చర్యమక్కర్లేదని పలువురు పేర్కొంటున్నారు.

ప్రసాదరావును కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పైల ప్రసాదరావును ఎం.కోటపాడు వల్లపురం టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు. ఎం.కోటపాడు రోడ్డు దుస్థితి గురించి కోటపాడు వల్లపురం ప్రజలు పడుతున్న ఇబ్బందులు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోట్ని బుజ్జి, గుమ్మాల ఉదయ్, పేలూరి రాము, తాటికొండ తిరునాద్, పిల్ల జయరాం, గుమ్మల నానాజీ, సురవరపు లోవరాజు, కోట్ని నాయుడు, కోట్ని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో గెడ్డపాలెం మండల పరిషత్ పాఠశాలలో ఫేర్వెల్ కార్యక్రమం నిర్వహించారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు 24 గంటల్లో శిక్ష అభినందనీయం

విశాలాంధ్ర - కశింకోట: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పిల్లల హత్య కేసుకు సంబంధించి 24 గంటల వ్యవధిలో నిందితున్ని ఎన్‌కౌంటర్ ద్వారా శిక్షించడం అభినందనీయమని కశింకోట అంబేద్కర్ యువజన సేవా సంఘం కార్యదర్శి జి.వెంకటరమణ తెలిపారు. కోర్టుల పేరుతో కాలయాపన చేస్తుంటే నిందితులు తప్పించుకు తిరుగుతున్నారని అన్నారు. ఇలాంటి తరుణంలో తప్పు చేసినవారికి వెంటనే శిక్ష పడేవిధంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగి చొరవతో పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడం అభినందనీయమన్నారు.

పెందుర్తి సీటు బండారుకే కేటాయించాలి

విశాలాంధ్ర - పరవాడ: పెందుర్తి నియోజకవర్గ అసెంబ్లీ సీటుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తిని ప్రకటించాలని టీడీపీ శ్రేణులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు వెన్నెలపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బండారు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ ప్లకార్డులు చేతపట్టి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. తెదేపా కోసం ఎన్నో పోరాటాలు చేసిన బండారుకు రెండో జాబితాలో పెందుర్తి సీటును కేటాయించకపోవడం సరికాదన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వెంటనేపునరాలోచన చేసి బండారుకు పెందుర్తి సీటు కేటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మానవరపు అప్పలనాయుడు, బీసీ సెల్ కార్యదర్శి అట్టా సన్యాసప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు విఐపి చిన్న, నాయకులు గొర్లి కనకారావు, పైల వరలక్ష్మి, పైల రథాల సన్యాసిరావు, సూరాడ బంగార్రాజు, పైలచినక్కునాయుడు, ఇందల కొండలరావు, గొర్లి శ్రీనివాస్, కేకే రాజు, గొంప మారునాయుడు, అభి నాయుడు, పైల కృష్ణ, పైల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పైలా ప్రచారం

విశాలాంధ్ర-కే కోటపాడు: మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన బిజెపి పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు కే. కోటపాడు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పంచాయితీలు, గ్రామాల వారీగా తెలుగుదేశం నాయకులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పైలా ప్రసాదరావుకు టిడిపి శ్రేణులు సాదర స్వాగతం పలుకుతూ అభినందనలు తెలియజేసారు. ఎన్నికలను సవాలుగా తీసుకుని టిడిపి గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిస్తూ తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలు -బాబు ష్యూరిటీతో భవిష్యత్తుకు గ్యారంటీ పై విస్తృతంగా అవగాహన కలిగించి, ఆన్ లైన్ నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైసీపి పార్టీ మట్టి కరవడం ఖాయమని, బూడి ముత్యాల నాయుడు ఓటమికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. భవిష్యతు మాడుగుల కోసం మనకు ఒక అవకాశాన్ని ప్రజలు ఇచ్చేందుకు సిద్ధంగా వున్నారని పైలా విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రశాంత వాతావరణానికి అంతా సహకరించాలి

గొలుగొండ ఎస్సై కృష్ణారావు, కృష్ణదేవి పేట ఎస్సై ఉపేంద్ర

విశాలాంధ్ర -గొలుగొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ 144 సెక్షన్ అమలులో ఉన్నందున గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు అందరూ సహాయ సహకారాలు అందించాలని గొలుగొండ ఎస్సై కృష్ణారావు, కృష్ణదేవి పేట ఎస్ఐ ఎం ఉపేంద్రలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎవరు గుంపులు గుంపులుగా ఉండకూడదని ఏ రాజకీయ పార్టీ తరపున ప్రచారం చేయకూడదని ఆయన హెచ్చరించారు ఇప్పటికే కొంతమంది పై ండోవర్ కేసులు నమోదు చేశామని గ్రామాల్లో వివాదస్పద వ్యాఖ్యలు చేసిన గొడవలకు రెచ్చగొట్టే మాటలు మాట్లాడిన వెంటనే పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని ఆయన కోరారు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకులు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు ప్రభుత్వ ఉద్యోగులు సచివాలయ ఉద్యోగులు గాని వాలంటీర్లు గాని ఎవరైనా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని వారు తెలిపారు అదేవిధంగా ఎన్నికల కోడ్ ను ఎవరు అతిక్రమించిన చట్ట ప్రకారం కేసును నమోదు చేస్తామని ఎస్సై ఉపేంద్ర ఈ సందర్భంగా హెచ్చరించారు.

దేశపాత్రునిపాలెంలో అడుగడుగునా అక్రమ లేఅవుట్లు!

- చోద్యంచూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

విశాలాంధ్ర-పరవాడ: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ ప్రాంతంలో అడుగడుగునా అక్రమ లే అవుట్లు వెలుస్తున్నాయి. అందులో ప్లాట్ల విక్రయ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వెంచర్లు వేస్తున్నారు. పట్టించుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు

పట్టనట్లు వ్యవహరించడంతో ప్రభుత్వ ఆధాయానికి భారీగా గండి పడుతుంది. పైగా అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పక పోవచ్చు. వ్యవసాయ భూమిని ఇతర అవసరాలకు అనుగుణంగా మార్పు చేయాలంటే ముందస్తు అనుమతి అవసరం. దీనికోసం నగర పంచాయతీ మొదలు ఆర్డీవో కార్యాలయం వరకు ఫైల్ నడవాల్సి ఉంది. అందుకు కొంత సొమ్ము చెల్లించి అనుమతి పొందిన తర్వాతే వ్యవసాయ భూమిని మార్పు చేయాలి. కానీ దేశపాత్రునిపాలెంలో అనేక చోట్ల ఎలాంటి అనుమతులు చలేకుండానే లే అవుట్లు పుట్టుకొస్తున్నాయి. పోల మాంబగుడి, శేషాద్రినగర్, సాయినగర్ కాలనీ, అశోక్ నగర్ కాలనీ, జాజులవానిపాలెం తదతర ప్రాంతాల్లో సుమారు 30కి పైగా అక్రమ లేవుట్లు పుట్టుకొచ్చాయి. ఇంకా పుట్టుకొస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాత్రం ప్లాట్లు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. వీటిపై అనేక పిర్యాదులు ఉన్నప్పటికీ ఇటు రెవెన్యూ అధికారులు కానీ, అటు టౌన్ ప్లానింగ్ అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు. మరో పక్క నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా జరిగిపోతుంది. ఫలితంగా ఈ అక్రమ లేఅవుట్లు అధికారులకు, నాయకులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ముఖ్యంగా సచివాలయం సమీపంలోనే ఇటీవల ఓ అక్రమ లే అవుట్ సిద్దమయింది. ఆ లేఅవుట్లో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దీనికి ఎటువంటి అనుమతులు లేవు. సచివాలయ ప్లానింగ్ సెక్రటరీకి పిర్యాదు చేసినా పట్టించుకోలేదు. పైగా ఆ లేఅవుట్ లో ప్రభుత్వ భూమి కూడా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సచివాలయం వీఆర్వో సాయి కూడా స్పష్టమైన వివరాలు ఇవ్వడం లేదు. ఇటు రెవెన్యూ, అటు టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరో పక్క ఈ రెండు శాఖల అధికార సిబ్బందిపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాసుల కక్కుర్తితో పట్టించుకోబడం లేదని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ, జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకొని ప్రభుత్వానికి ఆదాయం చూకూరేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, ట్రోలింగ్ లను తీవ్రంగా పరిగణిస్తాం

ఎస్పీ కె.వి. మురళీకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆన్ లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్లు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ హెచ్చరించారు.ఈ మేరకు ఆయన గురువారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాట్సప్, టెలిగ్రాం, ఫేస్ బుక్ గ్రూపుల్లో అడ్మిన్లు వాట్సప్, టెలిగ్రాం, ఫేస్ బుక్ వంటి గ్రూప్ లో ప్రతి పోస్టుకి బాధ్యత తీసుకోవాలని,గ్రూప్ లో యాడ్ చేసే ప్రతి సభ్యుడు తప్పకుండా అడ్మిన్ కి తెలిసి ఉండాలని సూచించారు.అభ్యంతకర, తప్పుడు వార్త, వదంతులు పై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని,ఎవరైనా సభ్యులు అభ్యంతకరంగా ప్రవర్తిస్తే వెంటనే గ్రూపు నుంచి తొలగించాలని, ఆ వివాదస్పద పోస్టింగ్కు సంబంధించి ఆడ్మిన్ చర్యలు తీసుకోకుంటే అతడిపై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.వివాదస్పద పోస్టు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్వేశాలు రెచ్చగొట్టేలా తప్పుడు సమాచారం తెలియని సమాచారం, వర్గపోరునకు దారి తీసేవి,మార్ఫింగ్ చేసిన ఫోటోలు,తప్పుదారి పట్టించే సమాచారం ఇవ్వకూడదని తెలిపారు. సమాచారాన్ని పంచుకునే ముందు దాన్ని ధృవీకరించడం ప్రాముఖ్యత గురించి స్నేహితులు, కుటుంబ సభ్యులకు తెలియ

జేయాలని కోరారు. నకిలీ వార్తలను మీరు కనుగొన్న ప్లాట్ఫారమ్ లేదా సోషల్ మీడియా సైట్కు నివేదించాలని, వార్తలను భాగస్వామ్యం చేయడానికి ముందు వాటి ప్రామాణికతను ధృవీకరిం చడానికి వాస్తవ తనిఖీ వెబ్సైట్లను ఉపయోగించుకోవాలని, సంచలనాత్మకంగా అనిపించే లేదా నిజం కావడానికి చాలా మంచి హెడ్లైన్లను క్లిక్ చేయడం లేదా షేర్ చేయడం మానుకోవాలని సూచించారు.మీకు ఫార్వార్డ్ చేయ బడిన సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వార్తా మూలాలు, కథనాల విశ్వసనీయతను అంచనా వేయడానికి విమర్శనాత్మక ఆలోచనను ఉపయోగించుకోవాలని సూచించారు.బాధ్యతాయుతమైన భాగస్వామ్యంతో సమాచారాన్ని పంచుకునే ముందు దాన్ని ధృవీకరించమని ఇతరులను ప్రోత్సహించాలని కోరారు.ఏదైనా సమాచారాన్ని పోలీసులకు ° తెలియజేయడానికి పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పోలీస్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ (9440904229.) (సమాచార అందించిన వారి వివరాలు గోప్యముగా ఉంచుతామని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు.

దివ్యాంగులకు తాత్కాలిక పునరావాస కేంద్రం

విశాలాంధ్ర -మాకవరపాలెం: మండల కేంద్రంలో దివ్యాంగులకు తాత్కాలిక పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని దివ్యాంగుల మ్యుచ్వల్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ తమరాన సతీష్, వైస్ చైర్మన్ గోపి తెలిపారు. స్థానిక తార భవనం వద్ద గురువారం మండలంలోని దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ అధికారులు స్పందించి దివ్యాంగులకు శాశ్వతంగా పునరావాసం కల్పించేందుకు వసతి సౌకర్యం కల్పించాలన్నారు. తాత్కాలిక పునరావాస కేంద్రంలో నియోజకవర్గంలోని ఏ గ్రామానికి చెందిన దివ్యాంగులకైనా వసతి, భోజన సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తమ సొసైటీలో ముందుగా సభ్యత్వం పొందాలన్నారు.

దుకాణాలైనా నిర్మించండి, అడ్వాన్స్ సొమ్మైనా తిరిగి చెల్లించండి

వేలం పాటదారుల విజ్ఞప్తి

విశాలాంధ్ర-చోడవరం: చోడవరం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో గల హార్డింజి రెస్ట్ హౌస్ ఆవరణలో నిర్మించిదలచిన దుకాణ సముదాయానికి చెల్లించిన అడ్వాన్సును తిరిగి చెల్లించాలని లేదా దుకాణాల నిర్మాణమైనా చేపట్టాలని వేలం పాటదారులు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఈవో ఎస్.వి.వి. సత్యనారాయణకు వారు వినతిపత్రం అందజేశారు. హార్డింజి రెస్ట్ హౌస్ కు ఉత్తరంలో గల బి.ఎన్. రోడ్డు వైపు సుమారు 12 దుకాణాలు నిర్మించేందుకు వాటిని ఐదు సంవత్సరాల కాలానికి లీజు పద్ధతిలో అప్పజెప్పేందుకు డిసెంబర్ 12, 2022లో బహిరంగ వేలం నిర్వహించారు. వేలంపాటలో పాల్గొనేందుకు ప్రథమ ధరావత్తుగా సుమారు 50 వేల రూపాయలు చెల్లించి బహిరంగ వేలంలో దుకాణాలు దక్కించుకున్న వేలం దారులు నలుగురు రెండు లక్షలు రూపాయలు చొప్పున 2023 ఏప్రియల్ లో దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెల్లించారు. వేలంలో పాడుకున్న దుకాణాలకు అడ్వాన్స్ చెల్లించి 15 నెలలైనను, దుకాణ నిర్మాణాలు చేపట్టకుండా అధికారులు మిన్నకున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ ను, ఎండోమెంట్స్ అధికారుల ను కలిసామన్నారు. అప్పులు చేసి చెల్లించిన అడ్వాన్సు, దరావత్తు సొమ్ము రూ.2,50,000లు తిరిగి చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ.ఓ.కు వినతి పత్రం అందజేసిన వారిలో ఉప్పల గణ నూకరాజు ఉరఫ్ ఉప్పల బాబు, సుంకర సత్యనారాయణ, ఉప్పల వెంకటేశు, సిరసపల్లి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. ఈ.ఓ. వివరణ : ప్రభుత్వ వేలం పాట నిబంధనల ప్రకారం నిర్ణీత సమయం లో ఒప్పంద రుసుము రూ. 5,00,000లు చెల్లించిన వారికి మాత్రమే దుకా ణాలు కేటాయిస్తామని అన్నారు. నిర్ణీత సమయం తరువాత, స్థానిక ఎమ్మెల్యే

చొరవతో ఒప్పంద రుసుము లో సగం ధర చెల్లించిన నలుగురకి ప్రభుత్వ నిబంధనల ప్రకారం, ఎండోమెంట్స్ కమీషనర్ ఆదేశాలు ప్రకారం ప్రథమ ధరావత్తు రూ.50,000లు మినహా అడ్వాన్సు నగదు రూ.2,00,000 లను వారం రోజుల్లోగా చెక్కు రూపంలో తిరిగి చెల్లిస్తామని తెలియజేశారు.

వైసీపీలో కొనసాగుతున్న చేరికలు

ఉత్సాహంలో పార్టీ క్యాడర్

విశాలాంధ్ర-నర్సీపట్నం : నర్సీపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ లో ఇతర పార్టీల నుండి చేరికల ప్రక్రియ కొనసాగుతోంది. నర్సీపట్నం నియోజవర్గం నాతవరం మండలం ఎంబీ పట్నం నుంచి సుమారు 30 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్సీపీలో చేరగా తాజా గా గురువారం నర్సీపట్నం మున్సిపాలిటీ పదో వార్డు నుంచి 30 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్సీపీలో చేరారు. వీరంతా నర్సీపట్నం మున్సిపాలిటీ పెద్దబొడ్డేపల్లిలో వైఎస్సార్సీపీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ సాదరంగా స్వాగతం పలుకుతూ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీరంతా మాట్లాడుతూ టీడీపీ లో దిగువస్థాయి నాయకులు, కార్యకర్తలకు విలువలు దక్కడం లేదని, జెండాలు మోసి మోసి మా భుజాలు అరిగిపోవడం తప్ప ఏమాత్రం ప్రయోజనం కనబడటం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరుతున్నాయని, ఇటువంటి ముఖ్యమంత్రి స్థాపించిన పార్టీలో పార్టీ అభివృద్ధికి పని చేయడం మా అదృష్టంగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, 16 వ వార్డు కౌన్సెలర్ వీరమాచినేని జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను మెరుగుపరచాలి : సిద్ధార్థ సోషల్ సర్వీస్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను మెరుగుపరిచి ప్రజలకు భద్రత, రక్షణ కల్పించాలని డీఎస్పీ ఎస్. అప్పలరాజుకుసిద్దార్థ సోషల్ సర్వీస్ %ఎ%కల్చ రల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభూషణం వినతిపత్రం అందజేశారు. అనంతరం మెయిన్ రోడ్ చేపల బజార్ వద్ద గల రామాలయములో బల్లా నాగభూష ణము తమ సంస్థ సభ్యులు స్థానిక భక్తుల తో కలసి జిల్లా ప్రజలకు ఏవిధమైన ప్రమాద ములు జరుగ కుండా కాపాడాలని సీతా రాముల వారికి పూజలు,ప్రార్థనలు నిర్వహించారు.ఈ ఈ సందర్భంగా బల్లా నాగభూష ణము మాట్లాడుతూ. నూతన జిల్లా అనకాపల్లి జనాభా విపరీతంగా పెరగడం, వాహన దారుల సంఖ్య కూడా పెరగడం,ఆటోలు,బస్సులు,హెవీ వెహికల్స్ కూడా నిత్యమూ పట్టణం లో గల అన్ని ముఖ్య రహదారులలో తిరగడము వలన ట్రాఫిక్ జామ్ అయి నిత్యమూ ట్రాఫిక్ సమస్యలతో అటు రోడ్లపై నడిచే పాదచారులు, వాహన దారులు ఈ ట్రాఫిక్ సమస్యల వలన తీవ్రమైన ఇబ్బందులు పడటము మరీ ముఖ్యముగా వృద్ధులు,మహిళలు పిల్లలు, స్కూల్ విద్యార్థులు రోడ్లపై నడిచి వెళ్లడానికి బిక్కు,బిక్కు మంటూ భయపడుతూ వెళుతున్నారని అన్నారు. ఈ ట్రాఫిక్ సమస్యల వలన అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టు కోవడ ము,క్షత గాత్రులుగా మారి అంగ వైకల్యం చెందటం వంటి విచారకరమైన సంఘటనలు జరగడం మనము నిత్యమూ చూస్తున్నామని అన్నారు.అలాగే పాద చారులు నడువవలసిన ఫుట్ పాత్ లపై వ్యాపారాలు,వాహన పార్కింగ్ ల సెల్లార్లలో కూడా వ్యాపార లావా దేవీలు జరపడము, చిల్లర వ్యాపారులు,తోపు డు బండ్ల,చిరు వ్యాపారాలు చేసే వారు తమ ఇష్టా రాజ్యంగా ట్రాఫిక్ కు అంతరాయం కలిగేలా వ్యాపారాలు చేసుకోవడం,పట్టణ ప్రాంతాల్లో గలముఖ్యమైన రద్దీ జంక్షన్ లలో సిగ్నల్ వ్యవస్థలు లేక పోవడంవంటి అనేక రకాల సమస్యలతో అనకాపల్లి పట్టణ ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. కార్యక్రమంలోకార్యదర్శి వినకోట నీలేశ్

గుప్తా,ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ మోహన్,సహాయకార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, ఇతర సభ్యులు రొబ్బి చంద్ర రావు,శ్రీమతి పెదిరెడ్ల సుజాత స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల ఉత్సవాల ద్వారానే సాంప్రదాయాలు కొనసాగింపు

మలసాల భరత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో- అనకాపల్లి: గ్రామ దేవతలను మాతృ మూర్తులుగా ఆరాధించడం మన సంస్కృతి, సాంప్రదాయమని అనకాపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ అన్నారు. అనకాపల్లి మండలం మొండిపాలెం గ్రామంలో వెలిసిన శ్రీ దుర్గమాంబ అమ్మవారిని, జగన్నాధపురం గ్రామంలో వెలిసిన శ్రీ నూకంబిక అమ్మవారిని, కసింకోట మండలం కన్నూరుపాలెం గ్రామంలో వెలిసిన ముత్యాలమ్మ అమ్మవారుల జాతరలను పురస్కరించుకొని గురువారం ఆయా ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక

పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అనాదిగా గ్రామాల్లో గ్రామ దేవతలను ఏర్పాటు చేసుకొని, ఆలయాలు నిర్మించుకొని పూజలు నిర్వహించడం మన పెద్దలు మనకి నేర్పించారు అని అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను మనం ఎల్లావేళలా కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో అనకాపల్లి మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు, వైస్ ఎంపిపి అయితా ఆనంద రాము,మండల కో ఆప్షన్ సభ్యులు బోండా అప్పలరాజు, అనకాపల్లి మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద్, ఆయా గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమికి లోక్‌సత్తా మద్దతు హర్షణీయం

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: జనసేన టిడిపి బిజెపి ఉమ్మడి కూటమికి లోక్ సత్తా పార్టీ మద్దతు తెలియజేయడం శుభ పరిణామమని మాజీమంత్రి, అనకాపల్లి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. గురువారం రింగ్ రోడ్ లోని పార్టీ కార్యాలయంలో లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బిశెట్టి బాబ్జిని రామకృష్ణ సత్కరించారు. అనంతరం హాజరైన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఒక మేధావి జయప్రకాష్ నారాయణ వంటి వ్యక్తి ఉమ్మడి కూటమిని స్వాగతించటం హర్షనీయం అన్నారు. జయ ప్రకాష్ నారాయణని స్వార్థ నాయకుడని కొనియాడారు. మూడు పార్టీల పొత్తు ప్రజలకు అవసరమని అన్నారు. రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు ఆయన అంది పలికారన్నారు. పదవుల కోసం పాకులాడలేదన్నారు. ఉమ్మడి కూటమి విధానాలకు అయిన మద్దతు తెలియజేయడం ప్రజలు గుర్తించాలన్నారు. 19 ఏళ్లుగా ఆయన నాయకత్వంలో పనిచేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు బిశెట్టి బాబ్జి ఉత్తరాంధ్ర చర్చ వేదిక ద్వారా ఎన్నో పోరాటాలకు తనకు మద్దతుగా నిలిచారన్నారు. అనకాపల్లి మొదటి శాసనసభ్యులు బీశెట్టి మనువడు అయినా బీశెట్టి బాబ్జి

మాట్లాడుతూ విజ్ఞత కలిగిన నేత కొణతాల అని కొనియాడారు. జేపీ తర్వాత జయప్రకాష్ నారాయణ ను తాను ఇష్టపడిన నాయకుడు రామకృష్ణ అని కొనియాడారు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొణతాల సేవలు అవసరమన్నారు. ఆయన అనకాపల్లి నుండి గెలుపొందడం చారిత్రాత్మక అవసరం అన్నారు. అనకాపల్లికి జయప్రకాశ్ నారాయణను తీసుకురావడం జరుగుతుందన్నారు. ఇక్కడ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొణతాల బాలాబాబు, భరత్ బాబు టిడిపి నాయకుడు కర్రి బాబి, జనసేన నాయకుడు దూలం గోపి, గంజి సత్య రావు, మంగా ఈశ్వర్ పాల్గొన్నారు.